

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

చీమకుర్తి: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల జట్లను బుధవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయిలో బాల బాలికలకు వేరువేరుగా జరిగిన ఎంపికలో ప్రతి జట్టులో 16 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేసినట్లు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ హజారీ బేగం, స్థానిక పీడీలు స్వరూపావాణి, పీ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో అండర్-14 జట్లు ఈనెల 16 నుంచి చిత్తూరు జిల్లా అరకొండలోను, అండర్-17 జట్లు కాకినాడ వద్ద జరిగే పోటీల్లో పాల్గొంటారు.

గరిష్టం/కనిష్టం
27/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ప్రకాశంభవనంలో కాలుష్య నియంత్రణ అమలుపై బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయు కాలుష్యం కలిగిన నగరాల్లో కాలుష్య నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆ మేరకు ఆ జాబితాలో ఒంగోలు నగరం ఉందని, నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందడంపై కారణాలు తెలుసుకుని వాటిని నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. నగరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. వాహనాల ద్వారా వచ్చే కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్ కల్తీ లేకుండా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలుష్యం విడుదల అయ్యే ప్రాంతాలను గుర్తించి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీటీసీ సుశీల, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎస్ఓ పద్మశ్రీ, పరిశ్రమ అధికారి శ్రీనివాసరావు, మైన్స్ డీడీ రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టెప్ సీఈవోగా శ్రీమన్నారాయణ బాధ్యతలు

ఒంగోలు సిటీ: స్టెప్, జిల్లా యువజన సంక్షేమ శాఖకు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.శ్రీమన్నారామణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ ఎం.వీ.ఎస్.లోకేశ్వరరావు నుంచి పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన శ్రీమన్నారాయణకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పూర్వపు డీపీవో ఉషారాణిపై సస్పెన్షన్ వేటు



బాధ్యతలు చేపట్టిన శ్రీమన్నారాయణ

ఒంగోలు అర్బన్: పూర్వపు డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి), పూర్వపు డీఎల్‌డీవో టీ ఉషారాణిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ మేరకు బుధవారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉషారాణి డీపీవోగా విధులు నిర్వహించిన సమయంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు అక్రమంగా పనిచేశారని, అవినీతికి పాల్పడ్డారనే అంశంపై ఆమెను సస్పెండ్ చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో త్రిసభ్య కమిటీ బదిలీల అంశంపై విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్.. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు నివేదికను పంపారు. దీంతో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో అక్రమాలపై మాదిగ పోరాట సమితి అధ్యక్షుడు సుజన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా అప్పట్లో బదిలీల అక్రమాలపై వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీంతో కలెక్టర్ బదిలీ ప్రక్రియపై విచారణకు ఆదేశించారు.

వెలుగులో చీకటి రాజ్యం

వెలుగు శాఖలో టీడీపీ చీకటి రాజ్యం కొనసాగుతోంది. టీడీపీ నేతలు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలనే ధిక్కరిస్తున్నారు. అధికార వ్యవస్థలు సైతం టీడీపీ నేతల చేతలకు జీ హుజూర్ అంటున్నాయి. డీఆర్డీఏలోని వెలుగు విభాగంలో ఐదు, పదేళ్లుగా పనిచేస్తున్న వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లను కూటమి ప్రభుత్వం కక్షగట్టి తొలగించింది. వైఎస్సార్‌సీపీ ముద్రవేసి చిరుద్యోగుల నోటి కాడ కూడు లాగేస్తోంది. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా ఇప్పటి వరకు జిల్లాలో 750 మందిని అన్యాయంగా తొలగించింది. ఎమ్మెల్యే సిఫారసుతో టీడీపీ సానుభూతి పరులను నియమిస్తోంది. కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నా.. కలెక్టర్‌ను కలిసినా అమలు చేసే దిక్కేలేదు.

- జిల్లాలో అక్రమంగా 750 మంది వీఓఏల తొలగింపు
- రాజకీయ ఒత్తిళ్లతోనే తొలగించారన్న ఆరోపణలు
- కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యం
- రెండు నాల్కల ధోరణిలో డీఆర్‌డీఏ పీడీ
- హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నా దిక్కేలేదు
- గౌరవ వేతనం పెంచి అండగా నిలిచిన జగన్ ప్రభుత్వం



కలెక్టర్ గ్రీవెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ వసుంధరతో మాట్లాడుతున్న తొలగించిన వీఓఏలు

ఒంగోలు అర్బన్:

జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ వెలుగులో 1163 మంది వీఓఏలుగా పనిచేస్తున్నారు. దాదాపు పదేళ్లుగా పనిచేస్తున్న వారి జీవితాల్లో చీకట్లు కమ్మాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 713 మందిని అక్రమంగా తొలగించింది. వీఓఏలపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి వారిని తొలగించి టీడీపీ సానుభూతిపరులకు కేటాయించుకునే కుట్రకు తెరతీసింది. అధికార పార్టీకి సంబంధిత అధికారులు అండగా నిలుస్తూ తమను అక్రమంగా తొలగించడంపై వీఓఏలు మండిపడుతున్నారు. ఐదేళ్లు, పదేళ్ల నుంచి పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగిస్తే జీవనం ఎలా కొనసాగించాలని ప్రశ్నిస్తున్నారు.

వెలుగు నింపిన వైఎస్సార్ సీపీ

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వీఓఏలకు రూ.3 వేలు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చేది. 2019లోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వీఓఏల గౌరవ వేతనాన్ని రూ.3 నుంచి ఒకేసారి రూ.10 వేలకు పెంచింది. జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో వీఓఏల జీవితాల్లో వెలుగులు నిండాయి. వేతనాలు పెంచడంతో వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్ల పాటు వీఓఏలు ప్రభుత్వం నిర్దేశించిన అన్నీ పనులను చిత్తశుద్ధితో నిర్వహించారు. ప్రభుత్వం మారడంతో టీడీపీకి చెందిన వారికి ఆ ఉద్యోగాలు కేటాయించుకునేందుకు స్థానిక నేతలు కుట్రలకు తెరతీశారు. అందినకాడికి దోచుకునేందుకు అక్రమంగా టీడీపీ సానుభూతి పరులను వీఓఏలుగా నియమిస్తున్నారు. ఇప్పటి వరకు పని చేసిన వీఓఏలపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి వారిని అక్రమంగా తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎటువంటి తీర్మానాలు లేకుండా తొలగింపు

బైలా, సర్క్యులర్ ప్రకారం వీఓఏల కాలపరిమితి మూడేళ్లు ఉంటుంది. ఆ తర్వాత గ్రామ సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు చేసి కొనసాగించడం లేదా స్థానాలు మార్చడం లేదా తొలగించడం చేస్తారు. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో ఎటువంటి తీర్మానాలు, నోటీసులు లేకుండా జిల్లాలోని అన్నీ మండలాల్లో 713 మందిని అకస్మాత్తుగా, అక్రమంగా తొలగించారు.

కలెక్టర్‌కు విన్నవించుకున్నా..

ఈ అక్రమ తొలగింపుపై మండలాల్లోని బాధితులు పలుసార్లు కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌తో పాటు పలుమార్లు డీఆర్‌డీఏ పీడీ, ఏపీఎం, ఎంపీడీఓలు, సీసీలను కలిసి తమ అక్రమ తొలగింపులు సరికాదని తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎన్నిసార్లు బాధితులు అధికారులను కలసి విన్నవించుకున్నా న్యాయం జరగలేదని, తొలగింపునకు గురైన వీఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలో రాజకీయ ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది ఏపీఎంలు, సీసీలు అధికార పార్టీకి అంటకాగుతూ బాధితులకు న్యాయం చేయటంలేదు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతిపత్రాలు డీఆర్‌డీఏ పీడీకి చేరినా ఆమె మాత్రం ఉన్నతాధికారులకు ఒక మాట, బాధితులకు మరో మాట చెప్తూ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని బాధితులు వాపోతున్నారు. నోటీసులు ఇవ్వలేదంటే మీరే విధుల్లో ఉన్నట్లు అని కలెక్టర్ గ్రీవెన్స్‌కు వచ్చిన పలు మండలాల వీఓఏలకు పీడీ చెప్పడం గమనార్హం. అయితే క్షేత్ర స్థాయిలో తొలగించిన వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తుండటంతో మేము ఎలా విధుల్లో ఉన్నట్లని అడిగిన ప్రశ్నకు ఆమె వద్ద సమాధానం లేదు. తొలగింపులకు సంబంధించి ఎటువంటి నోటీసులు, రాత పూర్వక ఉత్తర్వులు లేవు. అయినా విధులకు సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌ల నుంచి వారిని తొలగించి..విధులపై ఎటువంటి సమాచారం లేకుండా చేశారు. దీనికితోడు వారి స్థానంలో కొత్తవారు విధుల్లో ఉండటంతో వారిని తొలగించారనే విషయం స్పష్టమవుతోంది. ఇవన్నీ తెలిసినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కోర్టు ఉత్తర్వులను పట్టించుకోవడం లేదు

కలెక్టర్ కానీ, డీఆర్‌డీఏ పీడీ న్యాయం చేస్తారనే ఆశలు లేకపోవడంతో కొంతమంది వీఓఏలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు కూడా వారిని విధుల్లో కొనసాగించాలని ఆదేశాలిచ్చింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. వీఓఏలు కోర్టు ఉత్తర్వులతో విధుల్లో చేరినా రెండు, మూడు నెలల్లో తొలగించడం ఖాయమని, అలా బలవంతంగా వచ్చి చేరితే పనులు చేయగలరా అని అధికార పార్టీకి అంటకాగుతున్న కొంతమంది ఏపీఎం, సీసీలు నేరుగా బెదిరింపులు చేస్తున్నారని పలువురు వీఓఏలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత వీఓఏలే కాకుండా వీఓఏల అసోసియేషన్ తరఫున నాలుగు సార్లు కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరినా ఫలితం లేదని అసోసియేషన్ సభ్యులు వాపోతున్నారు. కింది స్థాయిలో పని చేసే తమలాంటి వారిపై రాజకీయ రంగు పూసి విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి

ఏళ్ల తరబడి వెలుగులో వీఓఏలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మమ్మల్ని అక్రమంగా తొలగించడం ఏంటి. మా వంటి చిరుద్యోగులపై రాజకీయ రంగులు రుద్ది ఎటువంటి తీర్మానాలు లేకుండా పక్కన పెట్టడం సరికాదు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ, ఏపీఎంలు, ఎంపీడీఓలను కలిసి విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరం. చివరకు కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకున్నా వాటిని పట్టించుకోకుండా మా జీవితాలతో ఆడుకోవడం మంచిది కాదు. ఈ వయసులో ఏ పని చేసి కుటుంబాలకు బాసటగా నిలవాలి. అధికార పార్టీ నేతల సిఫార్సులకు మా జీవితాలను రోడ్డు పాలు చేయడం సరికాదు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి తొలగించిన వీఓఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– పామూరు, పీసీపల్లి, టంగుటూరు, జరుగుమల్లి ఇతర మండలాల్లోని వీఓఏలు



కలెక్టర్ గ్రీవెన్స్‌కు వచ్చిన తొలగించిన వీఓఏలు





పోటీల్లో విజేతలైన బాలబాలికలకు బహుమతులిస్తున్న బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, చైల్డ్ వెల్ఫేర్ అధికారి దినేష్‌కుమార్, ఎఫ్ఎఫ్ఐ ఫౌండర్ వంశీకుమార్



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

చదువుతో హక్కుల సాధన

- క్రమశిక్షణతో మెలిగితే బాలలకు ఉజ్వల భవిష్యత్
- ఆధునిక సాంకేతికతను సన్మార్గంలో వినియోగించుకోవాలి
- బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ
- 'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం

ఒంగోలు టౌన్:



చదువుతోనే బాలలు తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు డి.నీలిమా వంశీలత పేర్కొన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం అగ్రహారంలోని ఎఫ్ఎఫ్ఐ ఫౌండేషన్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి నీలిమా వంశీలత మాట్లాడుతూ.. బాలలు చదువుకున్నప్పుడే స్వేచ్ఛగా ఎదుగుతారన్నారు. ప్రశ్నించడం, కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. పెద్దలు, గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా ఆలకించాలని, బాధ్యతగా మెలగడం, క్రమశిక్షణతో మసలడం అలవరుచుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు అలవాటు పడి కొందరు జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ఆధునిక సాంకేతికతను మంచి మార్గంలో వినియోగిస్తే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. బాలలు రోజూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. భారత దేశంలో ఇప్పటికీ 33 లక్షల మంది బాలలు చదువులకు దూరంగా వీధుల్లో తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో బాలల రక్షణకు ప్రత్యేక చట్టం వచ్చిందన్నారు. దీని ద్వారా ఎంతో మేలు జరిగిందని చెప్పారు. కట్టుబాట్ల పేరుతో బాల్యవివాహాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు బాలల సంక్షేమ కమిటీ కృషి చేస్తోందన్నారు. మహాత్మాగాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని బాలలు ముందుకు సాగాలన్నారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు 'సాక్షి' మీడియా గ్రూప్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు.

జిల్లా బాలల సంక్షేమాధికారి దినేష్ కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమ జీవితాలను తీర్చిదిద్దుకోడానికి శ్రద్ధ చూపాలని సూచించారు. బాల్యంలో కష్ట పడితే జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. చిన్ననాటి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు.

ఎఫ్ఎఫ్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ కుమార్ మాట్లాడుతూ.. మెరుగైన భవిష్యత్తు కోసం మెరికల్లా కృషి చేయాలని, ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చారు. సేవే లక్ష్యంగా ఈ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా బాల్య వివాహాల అనర్థాలపై ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.



చిన్నారులతో కలిసి సందడి చేస్తున్న బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ



మాట్లాడుతున్న బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ

బహుమతుల అందజేత

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బాలలకు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విదార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

చాచా స్ఫూర్తిని కొనసాగించాలి



భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరం ఉంది. దేశ ప్రధాన మంత్రిగా క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ చిన్నపిల్లల కోసం తన సమయాన్ని వెచ్చించిన నెహ్రూ చరిత్రలో చాచాగా నిలిచిపోయారు.

– పి.సావిత్రి, 8వ తరగతివిద్యార్థిని

చిన్నారుల భవితకు దిక్సూచి చాచా



జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆయన పాలనలోనే దేశ సమగ్రాభివృద్ధికి పునాదులు పడ్డాయి. బ్రిటిష్ పాలనలో విధ్వంసమైన దేశాన్ని గాడిలో పెట్టిన ఘనత నెహ్రూకే దక్కుతుంది. చిన్నారుల కోసం చాచాజీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

– రాజు, 9వ తరగతి

పశువైద్యశాలలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: స్థానిక ఏరియా పశువైద్యశాలలో వైద్యాధికారులు, వైద్యసిబ్బందిని ఆ శాఖ మార్కాపురం ఏరియా డిప్యూటీ డైరెక్టర్ యం.రాఘవయ్య బుధవారం విచారణ చేపట్టారు. 'సాక్షి' దినపత్రికలో ఈనెల 3వ తేదీ 'డిప్యుటేషన్ల పేరుతో డ్యూటీకి డుమ్మా' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన జిల్లా అధికారులు విచారణ చేయాలని మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ ను నియమించారు. ఆ మేరకు విచారణ చేపట్టినట్లు రాఘవయ్య తెలిపారు. వార్తా కథనంలోని అన్ని అంశాలను విచారణ చేసి సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారన్నారు. ఆ స్టేట్‌మెంట్లతోపాటు తాము గమనించిన విషయాలను పొందుపరుస్తూ నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. పశుగణన, గొర్రెలకు డీ వార్మింగ్ కార్యక్రమం జరుగుతోందన్నారు. పశువైద్యశాలలో మందుల కొరత తీర్చేందుకు ఇండెంట్ పెట్టామని, అవి రాగానే సరఫరా చేస్తామని తెలిపారు. మండలంలోని ఆవులమంద, పెద్దవరం గ్రామాల్లో పశువైద్యశాలల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏ గ్రామంలో జరిగితే ఆ గ్రామ ఆహా (యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్) తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా బ్రీడింగ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సీహెచ్ చంద్రశేఖరరావు, ఏడీఏ జీ నాగేశ్వరరావు, డాక్టర్ పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

- పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

మార్కాపురం టౌన్:

లక్ష్మీ చెన్నకేశవ స్వామి పుష్కరిణిలో కార్తీక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉభయదాత కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, కుటుంబ సభ్యులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారిని ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలను అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం చేసి, అనంతరం స్వామివారికి పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. అర్చకుల బృందం వేదమంత్రాలతో పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి కార్తీకమాసంలో క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఉభయదేవేరులతో రంగనాయక అలంకారంలో చెన్నకేశవ స్వామి వారు వెండి శేష వాహనంపై జలవిహారం చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుత్ దీపాల మధ్య కోనేటిలో విహరిస్తున్న చెన్నకేశవ స్వామివారిని భక్తులు తిలకించి తరించారు. స్వామి వారు పుష్కరిణిలో విహారం చేస్తుండగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. జై చెన్నకేశవా.. అంటూ ఆ ప్రాంతమంతా హోరెత్తింది. మహిళా భక్తులు పుష్కరిణి వద్ద కోలాటం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. పుష్కరిణిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా సీఐ సుబ్బారావు, డివిజన్‌లోని పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ, మున్సిపల్, రెవిన్యూ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



కోనేటిలో స్వామిని దర్శించుకుంటున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఉభయదాత డాక్టర్ కనకదుర్గ



విద్యుత్ కాంతుల మధ్య పుష్కరిణి వ్యూ